www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వుల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 2 | 18-10-2021 | పుటలు : 4


కలలు కనండి...కలలు కనండి
ఆ కలల్ని సాకారం చేసుకోండి.
అక్టోబర్ 15
అబ్దుల్ కలామ్ జయంతి

## జియోసైన్సెస్ లైబ్రరీని ప్రారంభించిన వీసీ



జియోసైన్సెస్ లైబ్రరీని ప్రారంభిస్తున్న వీసీ జగన్నాథరావు

**12.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని డిపార్టమెంట్ ఆఫ్ జియోసైన్సెస్ లైబ్రరీని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దాతల సహకారంతో జియోసైన్సెస్ విభాగంలో డిపార్ట్మెంట్ లైబ్రరీని ప్రారంభించడం జరిగిందని అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు డిపార్టమెంట్ లైబ్రరీని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ లైబ్రరీలో సుమారు 1000 జర్నల్స్, 100 టెక్ట్ బుక్స్, 150 థీసెస్, 100 జి.ఎస్.ఐ రిపోర్ట్స్, 200 ఎం.ఎస్సీ ప్రాజెక్ట్ వర్క్స్, 500 ఓ.ఎన్.జి.సి. న్యూస్ లెటర్స్, 500 పబ్లికేషన్స్ ఉన్నాయన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని మొట్టమొదటి డిపార్టమెంట్ లైబ్రరీగా దీనిని ప్రారంభించడం జరిగిందని చెప్పారు. విశ్వవిద్యాలయంలోని మిగిలిన విభాగాలు డిపార్ట్మెంట్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. విభాగ గ్రంథాల యాల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు అవసరమైన విద్య, విజ్ఞానం అందుతాయని తెలిపారు. తరువాత జియోసైన్సెస్ లో ఫుల్ టైమ్ స్కాలర్స్ తో వీసీ మాట్లాడి పరిశోధన అంశాలపై ఆరా తీసారు. సమగ్రమైన పరిశోధనలు చేయాలని, నిరంతరం పరిశోధన అంశాలపై దృష్టిని సారించాలని తెలియజేసారు. విభాగాధిపతి డా.కె.నూకరత్నం మరియు అధ్యాపకులు వీసీ ని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.వి.స్వామి, డా.కె.శామ్యుల్ పీటర్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ గెట్ టుగెదర్ పార్టీ





వానవస్తే .... కాగితాలే ...
పడవలయ్యే జ్ఞాపకాలే...
నిన్ను చూస్తే... చిన్ననాటి...
చేతలన్నీ చెంతవాలే...
గిల్లికజ్జాలెన్నో ఇలా పెంచుకుంటూ
తుళ్ళింతల్లో తేలే.. స్నేహం!
మొదలు తుదలు తెలిపే ముడే వీడకుండే.
ఒంటరైనా... ఓటమైనా
వెంటనడిచే నీడనీదే!
Oh my friend...
తడి కన్నులనే తుడిచిన నేస్తమా!
Oh my friend...
ఒడిదుడుకులలో నిలిచిన స్నేహమా!!







# సంపాదకీయం



## త్రి శక్తి.. స్త్రీ శక్తి

స్త్రీలో వాక్ శక్తి,ఐశ్వర్య శక్తి,సాహస శక్తి అనేవి ఉంటాయని వీటిని అభివృద్ధి చేసుకోగలగటమే నిజమైన స్త్రీ శక్తిని చాటడం అవుతుందని, స్త్రీ తన పాండిత్యాన్ని నేడు చూపగలుగుతోందంటే, ధర్మబద్ధంగా ధనాన్ని సంపాదించగలుగుతుందంటే, తన పరాక్రమాన్ని కూడా అవసరమైన పక్షంలో ప్రదర్శించగలుగుతుందంటే... అదంతా ఆమెలో నిక్షిప్తమైన ఆది పరాశక్తి కారణంగానే అని గమనించాలి,లేదా అంతర్లీనమైన భగవత్ శక్తిని మార్గదర్శకంగానైనా భావించాలి.

బ్రహ్మ సృష్టి.విష్ణువు రక్ష.శివుడు లయ. ఇక్కడే ఉంది చిత్రం. ఈ ముగ్గురు ఈ మూడు పనులను చేస్తున్నా ఇలా చేయవలసిందేనని వాళ్లకి అప్పుజెప్పింది ఆదిశక్తి. త్రిమూర్తులు తమ తమ పనుల్ని నెరవేర్చేలా చేస్తూ యుగాలని నడిపిస్తున్న ఆదిపరాశక్తి.స్త్రీకి ఇంత గొప్పతనాన్ని ఇచ్చింది భారతదేశం మాత్రమే.నోటిలో నాలుక మీద ఉంటూ బ్రహ్మ నుండి ఎప్పుడూ ఎడబాయని సరస్వతి,వక్ష స్థలాన్నుండి దిగకుండా తానున్న చోటుని ఆనామాలుగా అయ్యేలా చేసుకుని ఉండేది లక్ష్మి, ఇంక శరీరాన్ని చెరిసగంగా చేసుకుని ఎడమవైపున పార్వతి.... ఈ త్రి...శక్తి దేవతల సమష్టి పండుగ విజయదశమి.


స్త్రీకి ఉన్న గొప్పతనాన్ని లోకానికి చాటాలని భావించిన మహర్షులు అమ్మ వారి పండుగ రోజులను కేవలం తొమ్మిది రోజులు కాకుండా ముప్పై తొమ్మిది రోజుల పాటు చెయ్యాలని చెప్పారు. సంవత్సరం తలుపు తెరుచుకుందో లేదో ఆ రోజున వచ్చే ఉగాది నుండి శ్రీరామ నవమి వరకు వసంత ఋతువు లో జరిగే తొమ్మిది రోజుల ఉత్సవాలు వసంత నవరాత్రి ఉత్సవాలు. ఇంక శరత్కాలం ప్రారంభమయ్యే ఆశ్వయుజ మాసం మొత్తం ఈ త్రిశక్తి దేవతల పండుగ రోజులే. ఇవి ముప్పై. ఆ తొమ్మిదికి ఈ ముప్పై రోజులను కలిపితే ముప్పై తొమ్మిది రోజులు. ఒక స్త్రీకి ఇంతటి గౌరవాన్ని, ఇన్ని రోజుల పాటు ఉత్సవాలు చేయాలని చెప్పిన దేశం ప్రపంచ దేశాల్లో భారతదేశం మాత్రమే. అందుకే భారతదేశం స్త్రీని దేవతగా అభివర్ణించింది. స్త్రీని దేవత అంది.ప్రతి ఒక్క స్త్రీని ఆ అమ్మ స్వరూపంగా భావిస్తూ సంబోధనలో కూడా 'అమ్మా' అనవలసిందని చెప్పింది.

విజయదశమి స్త్రీలకు సంబంధించిన పండుగ. లోకంలో ప్రతి స్త్రీ కూడా తొమ్మిది నెలల పాటు తన గర్భంలో శిశువు ఉన్నకారణంగా ఏవో తింటూ, వ్యాధుల బారిన పడుతూ, నిద్ర సుఖాన్ని వదిలి, అనుక్షణం మార్పులకు గురవుతున్న శరీరంతో, మానసిక ఆందోళనతో తొమ్మిది నెలలు గడిపి పదవ నెల లో పండంటి బిడ్డను అందిస్తూ ఈ సృష్టికి ప్రధాన కారణమవుతోంది. సృష్టికి సంబంధించిన ఆమె విజయమే ఈ విజయదశమి అని కూడా మనం భావించాలి.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని భారతీయ సాహిత్యం మనకు తెలియచేసింది.

## మంచి మాట



రాపిడి లేకుండా వజ్రం మెరవదు, అలజడి లేకుండా సముద్రం వుండదు,కృషి లేకుండా ఫలితం రాదు.మంచి రోజులు అంటూ ఏమీ వుండవు. రోజుని మనమే మంచిగా మలుచు కోవాలి.అలాగే సంతృప్తి సాధనలో వుండదు. ప్రయత్నంలో వుంటుంది. పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తే విజయం కూడా పూర్తి స్థాయిలోనే అందుతుంది.

– అబ్దుల్ కలామ్.

## ఫ్యాకల్టీ అసోసియేట్‌గా జి.అశోక్




ఫ్యాకల్టీ అసోసియేట్ గా నియామకపత్రం అందిస్తున్న వీసీ

**11.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కంప్యూటర్ సెంటర్ కు ఫ్యాకల్టీ అసోసియేట్ గా గణిత విభాగం అధ్యాపకులు జి.అశోక్ ను నియమిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులను అందించారు. సోమవారం వీసీ కార్యాలయంలో ఉత్తర్వులను అందించి అశోక్ కు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఎగ్జామినేషన్ కంప్యూటర్ సెంటర్ ఎంతో కీలకమైనదని సమర్థవంతంగా సేవలందించాలన్నారు. కంప్యూటర్ సెంటర్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలలో సహాయపడాలని తెలిపారు. ధృవీకరణ పనిచేస్తున్న అధ్యాపకులకు సహాయం చేయాలన్నారు. కంప్యూటర్ సెంటర్ యొక్క వృత్యాసాల ధృవీకరణ పనిని వేగవంతం చేయడానికి సహాయపడాలని, అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధిగా నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, గణిత విభాగ అధ్యాపకులు అశోక్ కు శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, హర్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షహీద్ భగత్ సింగ్ జయంతి

### సెప్టెంబర్ 27



ఇంక్విలాబ్ జిందాబాద్!

భగత్ సింగ్ సమాధి పేరు
తేజ్ మహల్!
అది విప్లవకారుల శరతల్పం!
తేజ్ మహల్ వేదికపై
ఒకే ఒక్క విప్లవ మంత్రం...
"సర్ ఫరోషీకి ఆజ్ తమన్నాహై దిల్ మే దేఖా కిత్నా జోర్ హై బర్ఘూ – ఇ కాతర్ మే."
తెల్లదొరలకు ఒక సూటి ప్రశ్న:
"దేశంకోసం ఈ ఉరికంబాన్ని ముద్దాడి ప్రాణాలు అర్పించే ధైర్యం నాకుంది.ఈ ధైర్యం మీకుందా?"
రాజగురు, సుఖదేవ్ భగత్ సింగ్ కి అటూ ఇటూ
దేశభక్తిని,విప్లవాగ్నిని రగిలించిన చోటు తేజ్ మహల్!!
తేజ్ మహల్ కి నమస్కరిస్తూ....

- నన్నయవాణి

## ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

**15.10.21 (మీడియాసెల్)** భారతరత్న, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పుట్టిన అక్టోబర్ 15వ తేదీన వరల్డ్ స్టూడెంట్స్ డే జరుపుకోవడం మనందరి కి చాలా గర్వించ దగ్గ విషయం అని విశ్వవిద్యాలయ కాకినాడ ఎమ్.ఎస్.ఎన్ క్యాంపస్ ప్రత్యేకాధికారి డా. కమల కుమారి పేర్కొన్నారు. తొలుత అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి క్యాంపస్ లో అధ్యాపకులు ,అధ్యాపకేతర బృందం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం గారి జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని ఎక్కడో రామేశ్వరంలో పుట్టి కష్టపడి చదువు కుంటూ ఒక సైంటిస్ట్ గా, రాష్ట్రపతిగా ఎదిగిన ఆయన జీవితం విద్యార్థులందరికీ స్ఫూర్తి ప్రదాయకమని,ఒక విజేత ఆత్మకథ,నా దేశ యువజనులారా వంటి



కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కలామ్ రచనల్ని విద్యార్థులు తప్పనిసరిగా పఠించాలని డా.కమల కుమారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రశాంతిశ్రీ ,పోచయ్య, ఎమ్.సత్యనారాయణ, హేమలత ,హారిక,రాధా మాధవి , యేసురత్నం తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


Andhra Pradesh State Skill Development Corporation
(Department of Skills Development & Training, Govt of Andhra Pradesh)
Skill AP APSSDC

Pool Campus Drive at Adikavi Nannaya University - Rajamahendravaram

Date: 21-OCT-2021 at 10:00 AM

Venue: Adikavi Nannaya University, Raja Raja Narendra Nagar, Near Rajanagaram - Rajamahendravaram

MIRACLE SOFTWARE SYSTEMS

Now Hiring!

| Job Role | Software Trainee | US IT Business Development Executive | JS-IT Recruiter | PMO Executive |
| --- | --- | --- | --- | --- |
| Qualification | B.Tech(CSE/ECE/IT)/ MCA / PG/ MBA | Any Degree incl. B.Tech / PG/ MBA | Any Degree incl. B.Tech / PG/ MBA | Any B. Tech / PG/ MBA |
| Passout Year | 2020/2021 | 2019/2020/2021 | 2019/2020/2021 | 2020/2021 |
| Gender | Male/Female | Male/Female | Male/Female | Male/Female |
| Salary | 2.0 - 3.0 L/A CTC - Based on skill set | 1.4 to 2.6 L/A CTC (Variable Pay excluded) | 1.4 to 2.6 L/A CTC (Variable Pay excluded) | 1.4 to 2.6 L/A CTC (Variable Pay excluded) |

Note: Selected candidates need to give a Commitment for 2 Yrs 10 Months.

Skill Set: Knowledge in any - Programming Language/ Scripting Language / Any technology/MS Office.
Good communication skills.
Passion to learn Next Generation Technologies.

Documents Required :- Resume, All Xerox Copies of Educational Certificates, Aadhar, Bank Copy and 4-Photos.

Registration Link: https://tinyurl.com/Apssdc-EG-Pooldrive.

Job Location: Visakhapatnam /Vizianagaram

Please Contact: Vinod - 8099183854.

apssdc.in | AP State Skill Development | AP_Skill




## ప్రతిభా వాణి

### చిత్రకారులు కోన రమణరావు




1944లో ప్రకాశం జిల్లా చెరుకూరు లో పుట్టారు. ప్రస్తుతం చీరాల వైకుంఠపురంలో బాలసాయివీధిలో ఉంటున్నారు. సంగీతం, పద్య కవిత్వం, చిత్రలేఖనం వారి ప్రవృత్తులు. వృత్తిరీత్యా డాక్యుమెంట్ రైటర్. సాహిత్యంలో ప్రచురింపబడ్డ ఎన్నో కథలకు చిత్రాలను అందించారు. దూరమవుతున్న గ్రామీణ సంస్కృతి వైభవాలను నేటి తరాలకు అందించాలన్నదే వారి ఆశయం. చిత్రలేఖనం ద్వారా భావుకతకు రూపకల్పన ఇచ్చి, సాహితీ పరిచయం ద్వారా వర్ధమాన కళాకారులకు మార్గదర్శకంగా ఉండాలని ఒక ఆల్బమ్ అందించే ప్రయత్నంలో ఉన్నారు. పాత గుంటూరు తెలుగు మాండలికాలు సుమారుగా మూడు వేల పదాలు పైబడి ఆయన సేకరించి వాటి అర్థాలు ప్రయోగాలు రాశారు. ఇది ఒక విధంగా గుంటూరు మాండలికానికి సంబంధించిన ముఖ్యమైన నిఘంటువు. ప్రస్తుతం మనసు ఫౌండేషన్ ప్రచురణలో ఉంది. ఆయనకు ఏ డాక్టరేటు అవసరం లేని నిజమైన పరిశోధన ఇది. 78 ఏళ్ల వయసులో ఇటువంటి పరిశోధనలు, పరిశ్రమ, శ్రద్ధ,ఆసక్తి, అభిరుచి నేటి పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకం కూడా.

అడుగుల సదాశివయ్య, ఊర రామారావు, వేణుగోపాలన్ గార్ల వద్ద చిత్రలేఖనాన్ని, అబ్బరాజు వీర రాఘవయ్య గారి వద్ద కవిత్వ రచనను,పోరూరి లక్ష్మీ నరసింహారావుగారి వద్ద సంగీతాన్ని, భారతుల సుబ్రహ్మణ్యం, కొంపల్లి శేషతల్పశాయి గార్ల వద్ద నటనను, వల్లూరి శివయ్య గారి వద్ద హార్మోనియం నేర్చుకున్నారు. శ్రీమతి సీతామహాలక్ష్మి గారు ధర్మపత్ని. ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు సంతానం. సంగీత సాహిత్యాలతో, కుటుంబ సభ్యులతో, మనుమలతో ప్రశాంతమైన జీవన సాంగత్యం వారిది.

## ప్రతి సృష్టి


చిత్రకారుని గీత ఒక అద్భుతం గీతల్లో
తొంగిచూసే అందం ఒక విచిత్రం
వక్రగీతల చక్రబంధమే చిత్రం ఆలోచనల
కాన్వాస్ పై కుంచె చేసే విన్యాసం
అలరించే ప్రతి చిత్రం సరస హృదయ సారస్యం
మెలితిరిగిన ప్రతి గీత ప్రవచించే గీతా రహస్యం
విడివిడి గీతల తడిపొడి భావనలు
ఊహకందవు వాటివెనక భావాలు
వేళ్ళ వ్యక్తపరిచినరూపం అపురూపం
మనసును అలరించే సూర్యోదయం ప్రేయసీ
మనోహర సౌందర్యం
నదీ సంగమం, సాగరతీరం పురివిప్పిన
మయూర నాట్యం భావ పుష్టిగల చిత్రకారుని



దృష్టి సృష్టికి ప్రతి సృష్టి !
అది కల్పనలకు కుంభవృష్టి!!

**- వంగల రంగాచారి,చెన్నై.**

## భయం!



సముద్రంచేరువలో–
నది భయంతో వణకిపోతుందంటారు.
ఎక్కడెక్కడి పర్వతశిఖరాలు!
నది తాను ప్రవహించినంత
మేరని
సింహావలోకనం చేసికొంటోంది.
ఎన్నెన్ని అడవులూ!
ఎలాంటి ఊళ్ళూ!
అవన్నీదాటివచ్చిన దారి తనది!
ఇపుడిక్కడో–
తనముందు అనంత జలరాశి!
అందులో అడుగుపెట్టడమంటే–
తాను అంతరించిపోవటమే!
అంతకుమించిమరింకేమీలేదు!!

కాని––
తనకి వేరే దారే లేదే!
నది ఏమాత్రం వెనక్కి
మరలిపోలేదు!ఏమాత్రం...
మనుగడనుంచి మరలి వెనక్కి పోవటం
ఎవరికైనా –
అసాధ్యం! అసంభవం!!
సాగరసంగమమే నదికి శరణ్యం!
ఎందుకంటే...
అపుడే తన భయం అంతరిస్తుంది.
ఎందుకంటే–
సాగరంలో సంగమిస్తేనే నదికి
అర్థమవుతుంది.....
అది సముద్రంలో
అంతరించిపోవటంకాదని...
తానే సముద్రమై పోవటమని!!


**- (ఖలీల్ జిబ్రాన్ కవిత FEARకి తెలుగు సేత- పొన్నపల్లి శ్రీరామారావు,నరసాపురం)**

## విద్యార్థి లోకానికి, సమాజానికి రమణరావు గారి మాటల్లోనే వారి సందేశం


ఈ 78 వ యేట వరకు జీవన గమనంలో కళలతో మమేకమై, పల్లెసీమల్లో పుట్టి, పల్లె ప్రకృతి లోని ఆనందాన్ని అనుభవించి, పల్లెతో మమేకమై, పల్లె సౌందర్యాన్ని జీర్ణించుకుని జన్మ సుకృతం పొంది... బాల్యం అమ్మ ఒడిలోంచి బయట పడిన తర్వాత పల్లెతల్లి ఒడిలోకి చేరిన తర్వాత ప్రకృతిని అక్షరబద్ధం చేసే కుంచెతో చిత్రించే శక్తిని ఆ పరమేశ్వరుడు ఇస్తాడు. కవులకైనా, నటులకైన, చిత్రకారులకైనా భావుకత చాలా అవసరం. మా నాయన హనుమంతరావుగారు చిత్రకారుడు. తొమ్మిదేళ్లప్పుడు బొమ్మలు గీస్తుంటే అడుగుల సదాశివయ్య గారి దగ్గరకు తీసుకెళ్లారు. కాగితం తిప్పకుండా మణికట్టు ఎలా తిరగాలో చెప్పిన గురువు ఆయన.గురువే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు. గురువుల మాట వినాలి. అలా విన్న విద్యార్థికి జీవితంలో ఏ లోటూ రాదు. కళ అనేది అంతం లేని సముద్రం లాంటిది. సృజనాత్మకతకు అసలు హద్దు ఏది? ఇది నిరంతర సాధనే దాని సూత్రం. చందమామ పత్రికలలో చిత్ర,శంకర్ వంటి వారి కొన్నివేల బొమ్మల్ని ప్రాక్టీస్ చేశాను. ఇది చిత్రకారునిగా నా అనుభవం.

కథా రచయితగా, కవిగా మారటానికి ముందు భావానికి సృష్టికర్తగా ఉండేవాడు గురువు మాత్రమే. ఈ సంస్కృతికి తన విద్యార్థి దారి దీపం కావాలని గురువు ఆశిస్తాడు. భయంతో ప్రారంభమైన విద్య భక్తితో పరిపక్వతకు వస్తుంది. వారు నేర్పిన విద్యలే జీవితాన్నిచ్చాయి. మా గురువుగారు మద్దులూరి రామకృష్ణారావు గారు. జాతీయోద్యమంలో జైలుశిక్ష అనుభవించిన వ్యక్తి. నా చేత ఠాగూర్ మహాశయుని 'వేర్ ద మైండ్ ఈజ్ విదౌట్ ఫియర్....' కంఠస్తం చేయించారు.ఆ గీతం ద్వారా నిర్భయత్వం నేర్పించారని ఇప్పుడు నాకు అర్థం అవుతోంది. సంకుచితమైన గోడలను బద్దలు కొట్టుకుని విశాల హృదయంతో ఎలా జీవించాలో నేర్పారు. సమాజంలో ఎలా దూసుకుపోవాలి, సమాజానికి ఎలా సేవ చేయాలి, చెప్పు కుట్టిన వానిలో, బట్టనేసిన వానిలో, ఆకలి తీర్చిన రైతులో భగవత్ స్వరూపాన్ని ఎలా చూడాలన్నది ఆ రోజుల్లో మా గురువులు నేర్పారు. ఈ రోజు పది మందికి ఏదైనా చెప్పగలుగుతున్నానంటే అది మా గురువులు వేసిన పునాది మాత్రమే.మా లెక్కల మాస్టారు నాకు నేర్పిన విద్యతోనే నేను ఎన్నో భూములకు సంబంధించిన సర్వేయర్ తగాదాలను తీర్చాను. చివరికి మాస్టారుగారి భూమి కోర్ట్ తగాదాలోపడితే దాంట్లోనుంచి నేను ఆయన స్థలాన్ని ఆయనకు తీసి ఇచ్చాను. ఆరోజు ఆయన కళ్ళల్లో తాను నేర్పిన విద్యకి ఫల ప్రమాణంగా నేను కనిపించాను. వెలుగొందే విద్యార్థులను చూసి గురువులు ఎంత సంతోషిస్తారో ప్రత్యక్షంగా ఆరోజు ఆయనలో చూశాను. జీవన గమనంలో ఎన్నో గౌరవాలు, సన్మానాలు పొందాను.గురువులు నాకు నేర్పిన విద్యలకు సాక్షీభూతంగా మీ ముందు ఉన్నాను నేను.గురువులు మనకు పునాదిరాళ్లు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పుడూ మర్చిపోకూడదు. 'ఆ ప్రొద్దు వాటారి అవని అంచులు తాకి...' అనలేను కానీ.... నా కళల్లో,నా శ్వాసలో, నా భావనలో, నాలో, నీలో, అందరిలో కూడా అనంతమైన కళ
ఆచంద్రార్క స్థాయిగా భావితరాలకు అందుతూనే ఉంటుంది. వాళ్ల చిటికెన వేళ్ళు పట్టుకుని నడిచిన మేము మా చిటికెనవేలు పట్టుకునే వాళ్ళు లేక పోతున్నారే ఈ ఆధునిక నాగరికతా యుగంలో అనే దిగులు ఒకటి తప్ప, అటువంటి వారికోసం గురువులు ఎప్పుడూ ఎదురు చూస్తూనే ఉంటారు. నేను కూడా అంతే!


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నేను చిత్రించినన "నన్నయ తెలుగు మహాభారత రచనా వ్యాసంగం" చిత్రాన్ని స్వీకరించినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ నాలుగు మాటలు విద్యార్థి లోకానికి నన్నయవాణి పత్రిక ద్వారా అందిస్తున్నందుకు కూడా నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఈ సందర్భంలో విశ్వవిద్యాలయ ఉప కులపతి గారు జగన్నాథరావు గారికి, తదితర అధికారులు, ఆచార్యులందరికీ నా నమస్కారాలు తెలియజేస్తున్నాను. చిన్నపిల్లలు కావున విద్యార్థి లోకానికి నా ఆశీస్సులు.సెలవు.



దక్షిణామూర్తి



శిఖర దర్శనం




ఠాగూర్ రవికిరణాలు



నన్నయ రచనా వ్యాసంగం చిత్రాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పిస్తున్న రమణరావు దంపతులు




విశ్వవిద్యాలయ జ్ఞాపికను స్వీకరిస్తున్న సందర్భం




నన్నయ రచనా వ్యాసంగం



పోతన గజేంద్రమోక్ష ఘట్టం



నన్నయ సౌపర్ణాఖ్యానం




# ఎవరు నేర్పేరమ్మ.. ఈ కొమ్మకు పూలిమ్మని.. రెమ్మ రెమ్మకూ..

**- దేవులపల్లి కృష్ణశాస్త్రి**
















**చిగుళ్ల ఎర్రదనంతో, పువ్వుల తెల్లదనంతో, ఆకుల పచ్చదనంతో ఉంటుంది మొక్క! అందుకే మొక్క - భారతీయ త్రివర్ణ పతాక!! " ...అన్నారు కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు.**

## పువ్వులు దైవముఖాన విరిసిన నవ్వులు విశ్వవిద్యాలయ ప్రాంగణ సోయగం

రాజమహేంద్రవరం నుండి విశాఖ వైపునకు వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని నన్నయ విశ్వవిద్యాలయం 'వెలుగుబంద'లో చదువుల వెలుగులతో కొలువై ఉంది. విశ్వవిద్యాలయంలోనికి ప్రవేశిస్తుంటే...." శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ.... " అని తాళపత్రాలపై ఆంధ్ర మహాభారతాన్ని అక్షర రమ్యతతో లిఖిస్తున్న ఆదికవి నన్నయ భట్టారకులు చాళుక్య ద్వారం దగ్గర దర్శనమిస్తారు. విశ్వవిద్యాలయ ప్రాంతం రాజరాజనరేంద్రనగరం. విశాలమైన లోపలి దారుల్లో పూల మొక్కలు స్వాగతం పలుకుతూ పలకరిస్తాయి. ఆ మొక్కలకున్న ప్రతి పువ్వు ఒక పసిపాప బోసి నవ్వు.వాటి మధ్యన విశ్వవిద్యాలయం లోనికి అడుగు పెట్టే ప్రతి మనిషి కవి అవుతాడు. పసిపిల్లవాడవుతాడు. పచ్చని ఆకులతో మాట్లాడే ప్రకృతి ప్రేమికుడవుతాడు. సౌందర్యాన్వేషణలో

తాత్వికుడవుతాడు. ప్రాంగణంలోని ఆకు పచ్చని పూల వనాల మధ్యన ప్రకృతి తన సమస్త అందాలని ఆరబోసింది. విశ్వవిద్యాలయంలో వెన్నెల ఆకుపచ్చ ఆరబోసినట్లుగా ఉంటుంది. ఈ మొక్కల మధ్యన మనిషి తన నిజమైన మానవత్వాన్ని, మంచితనాన్ని ఆవిష్కరించుకుంటాడు. పూల మొక్కల ప్రకృతి మధ్య తనెంతో, తనేమిటో తెలుసుకుంటాడు. పుష్ప విలాసం విద్యార్థులకు మానసిక వికాసం కలిగిస్తోంది.

విశ్వవిద్యాలయ ప్రాంగణం నందనోద్యాన వనం. రావి, వేప, మర్రి, దేవకాంచనం, కాడమల్లి, తెల్లమద్ది, నేరేడు, కదంబం, మామిడి,మోదుగ, ఫాక్స్ టైల్, బోగన్ విల్లా....వీటి నీడన సేదతీరుతూ, స్వచ్ఛమైన గాలిని ప్రాణవాయువుగా తీసుకొంటూ సౌందర్యాన్ని అనుభవించే ఉద్యోగులకు రోజంతా మొక్కల పలకరింపులే!

విద్యార్థులకైతే పరిమళించే పలకరించే స్నేహాలే!!

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణం...

గ్లోబల్ వార్మింగ్ కి ఉపశమనం! ప్రకృతి రామణీయకానికి నిలువుటద్దం!!

విద్యార్థుల చదువుల్లో ఈ మొక్కలు వారి జ్ఞాపకాల హృదయ ఫలకాలపై పచ్చ యింకు సంతకాలు!!

ఈ సందర్భంలో.....

"ఆకులో ఆకునై....,పూవులో పూవునై.....,కొమ్మలో కొమ్మనై....,నునులేత రెమ్మనై....

ఈ ప్రాంగణంలో దాగిపోనా....!

నేనిచటనే ఆగిపోనా.....!!"











## రాజమహేంద్రి సాంస్కృతిక ధాత్రి

నన్నయ విశ్వవిద్యాలయం
ఇస్కాన్‌లో కృష్ణుని, గోదారి గట్టున
మార్కండేయస్వామి పాదపద్మం
చర్చిలోని పరిశుద్ధగంట
పెద్దమసీదులో నమాజ్ కా ఆవాజ్
ఈ నేల ఆదికవి చేతిలో తాళపత్రం
తూర్పుచాళుక్యులు రాసిన రాజపత్రం
కందుకూరి, చిలకమర్తి సంఘ సంస్కారం
శ్రీపాద, మధునాపంతుల కవిత్వసారం
ఎడతెగని గౌతమీ తరంగాలహోరు
గోదావరి జిల్లాల విద్యాభివృద్ధికి జలతారు
ఆచార్యా ! మీరు....
చినుకు పడితే చిగురు తొడిగే
సతతహరిత స్వప్నాన్ని సృష్టించారు
స్వేద జలాల్ని ఖాద్యఫలాలుగా మలిచే
సస్య క్షేత్రాన్ని నెలకొల్పారు
చదువంటే చదువేనా - సామాజిక చైతన్యం
భూమంటే భూమేనా - మనిషి చిరునామా!
మొక్కంటే మొక్కేనా - తరతరాలకు నిలిచే ప్రూను!!

మొక్కా జగన్నాథరావు గారికి..
సతత హరిత ప్రణామాలతో...

- నన్నయవాణి.











ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in